ఘనంగా దుందువా వేడుకలు


దుందువాకు నిప్పు పెడుతున్న భక్తులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురంలో శనివారం రాత్రి ఘనంగా దుందువా వేడుకలు నిర్వహించారు. రాష్ట్రంలో అతిపెద్ద దుందువా వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. లక్ష్మీచెన్నకేశవస్వామి కొలువైన గంగాపురం గ్రామంలో 60 అడుగుల దుందువాతో వేడుకలు అంబరాన్నంటాయి. గ్రామానికి చెందిన హరిజనులు పొలాల్లోంచి వావిలి, కంది, జీనుగ, గోగునార కట్టెలు తీసుకువచ్చి మూడు అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవుతో వరి తాళ్లతో దుందువాను తయారు చేశారు. దుందువా వద్ద హరిజనులు పూజలు చేసిన అనంతరం గ్రామస్తులు దాని చుట్టూ ప్రదక్షణలు చేశారు. రాత్రి వేళ దుందువాను లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం వద్దకు తీసుకెళ్లగా పూజారులు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం జై చెన్నకేశవ అన్న నామస్మరణ మధ్య దుందువాకు ఒకవైపు నిప్పంటించారు. అనంతరం గ్రామస్థులు భారీ తాళ్లతో దానిని గ్రామ వీధుల్లో లాగుతూ దివ్వి దివ్వి దీపావళి అంటూ దాని వెంట పరుగులు తీశారు. పిల్లలు, యువకులు, మహిళలు ఉత్సాహంగా గోవింద నామస్మరణతో వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామ వీధుల్లో దుందువా లాగుతుండగా దాని నుంచి విడిపోయే కర్రలు లాక్కునేందుకు పోటీ పడ్డారు. ఈ వేడుకతో గ్రామంలో శీతాకాలంలో వచ్చే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని గ్రామస్థుల విశ్వాసం.

క్రికెట్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రికెట్‌లో జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ చాటాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో 3వ జలజం సత్యనారాయణ టీ–10 ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ హోరాహోరీగా కొనసాగుతుంది. శనివారం ఎండీసీఏ కార్యదర్శి రాజశేఖర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. నైపుణ్యంగల క్రీడాకారులను ఎండీసీఏ ప్రోత్సహిస్తుందని అన్నారు. క్రికెట్‌లో చిన్నప్పటి నుంచే పట్టు సాధిస్తే.. భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారుడిగా ఎదగవచ్చన్నారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, కోచ్ గోపాలకృష్ణ, పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

■ నాలుగో రోజు జరిగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ జట్టు 28 పరుగుల తేడాతో గెలాక్సీ హైస్కూల్ జట్టుపై, మరో మ్యాచ్‌లో ఫాతిమా విద్యాలయం జట్టు 6 వికెట్ల తేడాతో ఉదయం మెమోరియల్ స్కూల్ (జడ్చర్ల) జట్టుపై విజయం సాధించాయి. జెడ్పీహెచ్‌ఎస్ నంచర్ల జట్టు 59 పరుగుల తేడాతో గీతాశ్రీ స్కూల్ (జడ్చర్ల) జట్టుపై, లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ జట్టు 20 పరుగుల తేడాతో రిషి స్కూల్ జట్టుపై విజయాలు నమోదు చేసుకున్నాయి.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

నవాబుపేట: మండలంలోని కొల్లూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మండల పర్యటనలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు.

తూక్యాతండాకు ఎమ్మెల్యే

ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఆదివారం తూక్యాతండాలో జరిగే నూతన హనుమాన్ దేవాలయ పూజా కార్యక్రమంలో పాల్గొంటారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య తెలిపారు. అనంతరం రుద్రారం గ్రామంలో నిర్మించిన పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

మైనార్టీల అభ్యున్నతికి రిజర్వేషన్లు తప్పనిసరి

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీల అభ్యున్నతికి రిజర్వేషన్లు తప్పనిసరి అని ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా అన్నారు. జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. నేటికీ ముస్లిం మైనార్టీలు అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడిపోయారని అన్నారు. జనాభా దమాషా ప్రకారం అన్ని రాజకీయ, ఆర్థిక, సామాజిక, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ముస్లిం మైనార్టీలకు అన్యాయం జరగకుండా సచార్ కమిటీ నివేదికను అమలుపర్చాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాఖూబ్ ఉన్నారు.

అలరించిన నటరాజు నాట్యమండలి చిన్నారులు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని ముచ్చింతలలో త్రిదండి చినజీయర్ స్వామి తిరునక్షత్ర మహోత్సవంలో జిల్లాకు చెందిన నటరాజు నాట్యమండలి చిన్నారులు తమ నృత్యప్రదర్శనతో అలరించారు. కార్యక్రమంలో నటరాజు నాట్యమండలి గురుజీ అనూష పాల్గొన్నారు.

పశు వైద్యాధికారిగా ప్రవీణ్

దేవరకద్ర: దేవరకద్ర పశు వైద్యశాలకు వైద్యాధికారిగా డాక్టర్ ప్రవీణ్‌ను నియమించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జీషన్ ఆలీ బదిలీ కావడంతో ఇంచార్జి పశు వైద్యాధికారిగా రాంప్రసాద్ పని చేశారు. డాక్టర్ ప్రవీణ్ శనివారం విధుల్లో చేరారు.

పేరూర్‌కు సుశీల్ గౌతమ్...

కొకుంట్ల మండలం పేరూర్‌లోని పశు ఆస్పత్రి డాక్టర్ సుశీల్ గౌతమ్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన పశువైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం

జడ్చర్ల: మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన బాగం రాజు(38) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. బాగం రాజు భార్య 12 ఏళ్ల క్రితం మరణించింది. అప్పటి నుంచి అతడి పెద్దనాన్న కుమారుడు బాగం శ్రీశైలం వద్ద రాజు ఉండేవాడు. కూలీ పనులు చేసేందుకు బయటకు వెళ్లి మూడు నెలలు అయినా రాకపోవడంతో అతడి సోదరుడు శ్రీశైలం శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నవాబుపేటలో గ్యార్మీ

నవాబుపేట: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల దర్గాలో శనివారం గ్యార్మీ మైనార్టీ యువకులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు, ఎస్‌ఐ విక్రమ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు బంగ్లరవి, అంజయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ యువకులు ధాహెర్, రహీం, ఆశం, ఫయాజ్, సలాఉద్దీన్, ఐయాన్, ఖాజా, పాషా, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సదర్ ఉత్సవాలు



హన్వాడ: మండల కేంద్రంలో శనివారం యాదవులు సదర్ ఉత్సవాలను సందడిగా నిర్వహించారు. ప్రధాన రహదారిపై బర్రెపోతులతో ఊరేగింపుగా ర్యాలీ చేపట్టారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన నాయకులు సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అనిత, తక్కియోద్దీన్, కాంగ్రెస్ నాయకుడు శ్రీకృష్ణ ప్రతిమకు పూజలు చేశారు. సదర్ ఉత్సవాన్ని ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులా?


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు కేసులు పెట్టిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. శనివారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా నాయకులు వర్ధభాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివరాజ్ మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యంపై పోస్టులు పెట్టడం కారణంగా వన్ టౌన్ సీఐ బీఆర్‌ఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కి పిలిచి కొట్టడం ప్రజా పాలనలో భాగమేనా అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ అశాంతి కావడానికి ఆనంద్ గౌడ్ కారణమని, పార్టీ అన్ని అవకాశాలు పార్టీ లో ఇచ్చినా కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. అమరేందర్ రాజు, రాఘవేందర్‌రాజుతో ఆనంద్ గౌడ్ గొడవ పెట్టుకోక పోతే మహబూబ్‌నగర్ ప్రశాంతంగా ఉండేదన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు గణేష్, రాము, సీనియర్ నాయకులు సతీష్, అహ్మదుద్దీన్, సత్యం యాదవ్, సుధాకర్, ఇమ్రాన్, అభిషేక్, ఇబ్రహీం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వేపై విపక్షాలది అనవసర రాద్ధాంతం

డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: సమగ్ర సర్వేపై విపక్షాలది అనవసర రాద్ధాంతమని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్వేపై ఎవరికి ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని, సర్వేకు సహకరించాలని కోరారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సకల జనుల సర్వే చేపట్టి కనీసం రిపోర్టును కూడా బయటపెట్టలేదని ఎద్దేవా చేశారు. బీజేపీ శాసనసభపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి రాజకీయ అజ్ఞాని అని, సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పూర్తి కాలం సీఎంగా కొనసాగుతారని తెలిపారు. త్వరలో అరెస్టు అవుతానన్న భయంతో కేటీఆర్ కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఆయన్ను పట్టించుకునే స్థితిలో ప్రజలు లేరన్నారు. సమావేశంలో టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, నాయకులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రీ, బెక్కరి అనిత, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం ఉద్యమిద్దాం


ఆటో కార్మికుల మహాధర్నా పోస్టర్లను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ అన్నారు. శనివారం మండలంలోని జమిస్తాపూర్‌లో ఐఎఫ్‌టీయూ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆటో కార్మికులకు ప్రతి ఏడాది రూ. 12 వేలు ఇవ్వడంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి, బీమా సౌకర్యం కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను మరిచిపోయిందని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు జీవనోపాధి సమస్యగా మారిందన్నారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల 13 డిమాండ్ల సాధన కోసం ఈ నెల 5న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నామని.. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహాధర్నా పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో కిషన్, విజయ్‌కుమార్, మురళీగౌడ్, రాఘవేందర్, తిరుపతయ్య, ఆంజనేయులు, మహేష్, సుధాకర్, శ్రీను, నాగార్జునగౌడ్, రమేష్, తిరుపతయ్య ఉన్నారు.

బీమాతో ధీమాగా ఉండాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పోస్టర్ అధికారి వంశీ.

నవాబుపేట: బీమా చేసి ధీమాగా ఉండాలని జిల్లా పోస్టల్ ఇన్స్‌పెక్టర్ వంశీ, నవాబుపేట ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రవినాయక్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత బీమా సర్వీస్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ఏడాదికి వందల్లో రూపాయలు చెల్లించే ప్రమాధ బీమాలు సైతం అందుబాటులో ఉన్నాయని, వాటిని అందరూ ఉపయోగించుకోవాలన్నారు. అవగాహన లేకపోవటంతో చాలా మంది బీమా చేయించుకోవడం లేదన్నారు. తాజాగా చేపట్టిన అవగాహన కార్యక్రమం చాలా మంచిదని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుధాకర్‌చారి, రఘువీర్‌శర్మ, ఆంజనేయులు, రమేష్, నిరంజన్, నసీర్, మహేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అక్షిత


పీఈటీ భవ్యశ్రీతో అక్షిత

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్ జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.అక్షిత రాష్ట్ర స్థాయి అండర్–14 ఖోఖో పోటీలకు ఎంపికైంది. శుక్రవారం కోయిలకొండ మండలంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో, ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు కామారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీఈటీ భవ్యశ్రీ తెలిపారు. జీహెచ్‌ఎం వెంకటేశ్వర్, వెంకటశర్మ, ఉపాధ్యాయులు అక్షితను అభినందించారు.

శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుందాం


పూర్వ విద్యార్థులతో సమావేశమైన హెచ్‌ఎం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జడ్పీ హైస్కూల్ 1925–26లో ప్రారంభమై వచ్చే ఏడాది 100 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన శతాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొని వారి అభిప్రాయాలు వెల్లడించారు. హైస్కూల్‌లో వేలాది మంది చదివి ఉన్నతస్థితిలో ఉన్నారని, వారందరిని ఆహ్వానించి సత్కరించాలని తీర్మానించారు. ఆ స్కూల్ హెచ్‌ఎం చంద్రకళ మాట్లాడుతూ పాఠశాల శతాబ్ది ఉత్సవాలను పూర్వ విద్యార్థులు నిర్వహిస్తే పూర్తి సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు వి.కృష్ణ, సయ్యద్ ఇబ్రహీం, డా.రాఘవేందర్, సత్యం, రంగభాను, వెంకటరమణాచార్యులు, కాల్వ రాంరెడ్డి, గోపాల్, తెలుగు సత్తయ్య, శంకర్, గిద్దరాజు, జహంగీర్ పాష, రాజుగౌడ్, శ్రీహరి, ఈ.జగదీశ్వర్ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ ఆధ్వర్యంలో వాక్‌థాన్


వాక్‌థాన్ నిర్వహిస్తున్న ఏపీజీవీబీ మేనేజర్లు, ఉద్యోగులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఎ.రవికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగొండ నుంచి మెట్టుగడ్డ వరకు 3కిలోమీటర్ల వాక్‌థాన్ నిర్వహించారు. ప్రభుత్వ సేవలో పారదర్శకత, సమైక్యతను పెంపొందించే విధంగా ఏపీజీవీబీ వారు ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ బిజినెస్ గోపాల్, సీనియర్ మేనేజర్ ఆపరేషన్స్ రంగస్వామి, లీడ్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్‌తో పాటు దాదాపు 50 బ్రాంచీల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

జనాభా కులగణనను స్వాగతిస్తున్నాం

మిల్లిమహాజ్ మహబూబ్‌నగర్ ప్రతినిధులు


మాట్లాడుతున్న ఖాజఫయాజుద్దీన్ అన్వర్‌పాష

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ కులగణన సర్వే చేపట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు మిల్లిమహాజ్ మహబూబ్‌నగర్ ప్రతినిధులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సామాజిక న్యాయం దిశగా కులగణన సర్వే అభినందనీయమని అన్నారు. అరబ్బులు, సయ్యద్‌లు, మొఘలులు, పఠాన్‌లు, ఖాన్‌లు వంటి ముస్లిం తరగతులు కూడా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నందున వారిని బీసీ–ఈ జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సర్వేలో జిల్లాలోని ముస్లింలు తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈనెల 8న మహబూబ్‌నగర్‌లో బీసీ కమిషన్ పర్యటిస్తున్నదని, బీసీ–ఈ రిజర్వేషన్లను 10 శాతానికి పెంచాలని కమిషన్ దృష్టికి అన్ని రాజకీయ పార్టీలు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సర్వేపై మరింత సమాచారం కోసం మార్కెట్‌రోడ్డులోని మిల్లిమహాజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో మిల్లి మహాజ్ చీఫ్ ప్యాట్రన్ ఖాజఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, కన్వీనర్లు తఖీ హుస్సేన్, ఖుద్దూస్‌బేగ్, ప్రతినిధులు హాఫిజ్ ఇద్రీస్, అబ్దుల్లా సున్నీ, అమీర్, మహ్మద్ హకీం తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలోని మొత్తం 49 వార్డులలో ఈనెల 6 నుంచి 30వ తేదీ వరకు సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆర్‌పీలు, మున్సిపల్ సిబ్బంది (ఎన్యూమరేటర్లు) కి శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన వార్డులలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబం పూర్తి సమాచారం సేకరించారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని, ఏమైనా సందేహాలుంటే సూపర్‌వైజర్లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శంకరయ్య పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

మహబూబ్‌నగర్ క్రైం: ఓ ప్రయాణికురాలు ఆటోలో మరిచిపోయిన బ్యాగ్‌ను అప్పగించి ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హబీబ్‌నగర్ ఏరియాకు చెందిన ముబీనా బేగం శనివారం బస్టాండ్ దగ్గర ఆటో ఎక్కి ఇంటికి చేరుకుంది. ఈ క్రమంలో బ్యాగ్‌ను ఆటోలో వదిలేసి వెళ్లిపోయింది. బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించగా రెండు పోలీస్ బృందాలు ఏర్పాటు చేసి పోయిన బ్యాగ్‌ను గుర్తించే ప్రయత్నంలోనే ఆటో డ్రైవర్ నిజాయితీగా బ్యాగ్‌ను తీసుకువచ్చి పోలీసులకు అప్పగించాడు. ఆ బ్యాగ్‌లో రెండు స్మార్ట్ ఫోన్స్, రెండు బంగారం కమ్మలు, నాలుగు వెండి మెట్టెలు ఉన్నాయని గుర్తించి సదరు బ్యాగ్‌ను బాధిత మహిళకు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ కాశీంను అభినందించారు.

కమిటీ హాలు పనులు పూర్తి చేయండి


పాతపాలమూరు లోని మల్టీప్లెక్స్ కమిటీ హాలును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాత పాలమూరు (వార్డు నం.11) లోని మల్టీప్లెక్స్ కమిటీ హాలులో మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆదేశించారు. శనివారం ఆ హాలును తనిఖీ చేసి వీలైనంత తొందరగా అందుబాటు లోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే పదోవార్డు పరిధిలోని ఎస్‌ఆర్‌నగర్‌లో పర్యటించారు. కాగా, కాలనీలో నుంచి వెళుతున్న పెద్ద మురుగుకాల్వను బాగు చేయించాలని, సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వృథాగా ఉన్న షీ మొబైల్ టాయిలెట్స్ బస్సును పరిశీలించారు. దాని లోపల కొనసాగుతున్న మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ బస్వరాజ్, కాలనీవాసులు భరత్, కుమార్, నవకాంత్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ఎంపీ డీకే అరుణ


ఎంపీ డీకే అరుణను కలిసిన బీజేపీ మండల నాయకుడు రఘురాంగౌడ్

హన్వాడ: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీ డీకే అరుణ సూచించారు. మండల బీజేపీ నాయకుడు రఘురాంగౌడ్ శనివారం ఎంపీ డీకే అరుణను తన నివాసంలో కలిశారు. మండలంలో పీఎం విశ్వకర్మ క్రింద దరఖాస్తులు చేసుకున్న దరఖాస్తుదారులకు కొందరికి మెసేజ్‌లు రాగా మరికొందరికి రాలేదని ఎంపీకి రఘురాంగౌడ్ వివరించారు. ఈమేరకు స్పందించిన ఎంపీ అరుణ వెంటనే జిల్లా కలెక్టర్‌కు సమస్యను వివరించారు. ప్రతి ఒక్కరికి కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని సూచించారు.

కార్తీక మాస పూజలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని శివాలయంలో శనివారం కార్తీక మాస పూజలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపారాధన కార్యక్రమం ప్రారంభించారు. శివ నామస్మరణ చేస్తూ ఆకాశ దీపాన్ని ధ్వజస్తంభం పైకి తాడు సహాయంతో తీసుకుపోయి వెలిగించారు. ప్రతి రోజు దీపారాధన ఉంటుందని పూజారులు తెలిపారు. కార్తీక మాసం ముగిసే వరకు శివాలయంలో అభిషేకాలు అర్చనలు నిత్యం నిర్వహిస్తామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

దేవరకద్ర: గుడిబండ గ్రామంలో బోయ నిర్మలమ్మ మృతి చెందడంతో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గౌని అమరేశ్వర్‌రెడ్డి బాధిత కటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాములుగౌడ్, నర్సింలు గౌడ్ ఉన్నారు.

విద్యార్థిని అదృశ్యం

మహబూబ్‌నగర్ క్రైం: స్నేహితురాలి ఇంటికి వెళ్లి తిరిగి వస్తానని చెప్పి వెళ్లిన బాలిక మళ్లీ అదృశ్యమైనట్లు రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తిమ్మాసనిపల్లికి చెందిన మహేశ్వరి అనే తొమ్మిదో తరగతి విద్యార్థిని అక్టోబర్ 11న స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించిన ఆచూకీ లభించకపోవడంతో శనివారం బాధితురాలి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఘనంగా బోనాలు



జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం గ్రామంలో శనివారం రాత్రి బోనాలను వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన జాంగ్ర కులస్థులు ప్రతి ఏటా దీపావళి పండుగ మరుసటి రోజున పోచమ్మ అమ్మవారికి బోనాల ఉత్సవం జరుపుకుంటారు. ఇందులో భాగంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బీసీల హక్కులను కాలరాసిన కేంద్రం

మహబూబ్‌నగర్ రూరల్: అగ్రకుల పేదలకు విద్య, ఉద్యోగాల్లో కేంద్ర ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు కేటాయించి బీసీల హక్కులను కాలరాసిందని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ అన్నారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో బీసీ జాగృతి సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కులాల జనాభా లెక్కలను డిసెంబర్ నాటికి బహిరంగంగా ప్రకటించి జనాభా దామాషా నిష్పత్తిన బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు వీరేష్, నర్సిములు, గోపాల్, విజయ్, శ్రీనివాస్‌యాదవ్, కుర్మయ్య, శేఖర్, భీమ్‌రాజ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని మద్యం స్వాధీనం

నవాబుపేట: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. కొత్తపల్లికి చెందిన అశోక్ అనే వ్యక్తి శనివారం తన కిరాణం దుకాణంలో అనుమతి లేకుండా మద్యం అమ్ముతుండగా అతడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.